7

సాక్షి
మహబూబ్‌నగర్

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



జీవితానికి వెలుగుబాటను ప్రసాదించే గురువు రుణాన్ని శిష్యుడు ఏ రూపంలోనూ తీర్చుకోలేడు. అందుకే మాతృదేవోభవ.. పితృదేవోభవ తర్వాత గురువుకే ఆ స్థానం ఇచ్చారు. ఉపాధ్యాయ వృత్తి అంటే ఏదో నాలుగు పాఠాలు చెప్పామా.. వెళ్లామా.. అని కాకుండా కొంత మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. సమాజ నిర్మాతలుగా తమకంటూ ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు. వృత్తికి న్యాయం చేస్తూ పిల్లల ఉన్నతికి కృషి చేస్తూ అవార్డులు, ప్రశంసలు సైతం పొందుతున్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొందరు ఉత్తమ ఉపాధ్యాయుల గురించి ప్రత్యేక కథనాలు.. -మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

గురువులే మార్గదర్శకులు

సినిమా చూసిన విధంగా..



ఒక థియేటర్ రూపంలో తీర్చిదిద్దిన గదిలో బోధిస్తున్న హిమబిందు

ఎంపీపీఎస్ చౌదర్‌పల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు హిమబిందు విద్యార్థులకు భయం లేకుండా, తప్పులు దొర్లకుండా రాయడం, చదవడం వంటివి వినూత్న పద్ధతుల్లో చేస్తున్నారు. ఇంగ్లిష్‌లో ఉండే పలు పద్యాలు, కథలు, నాటికల వంటి వాటికి ప్రత్యేక క్యారెక్టర్లను సృష్టించి, ఒక మినీ థియేటర్ రూపంలో విద్యార్థులకు సినిమా చూసిన విధంగా నేర్పించడం ఈమె ప్రత్యేకత. దీని ద్వారా విద్యార్థులు ఏకాగ్రతతో సులువైన పద్ధతి, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతూ.. పాడుతూ పాఠ్యాంశాలను నేర్చుకునేందుకు దోహదపడుతుంది. క్యారెక్టర్ చేసే విద్యార్థులు సందర్భోచితంగా ఇంగ్లిష్ పలికే విధానం, గ్రామర్ వంటి అంశాలను సులువుగా నేర్చుకుందునేందుకు ఆస్కారం ఉందంటున్నారు.

జీవితాంతం ఉపయోగపడాలి

ఇంగ్లిష్ బోధన కేవలం పాఠ్య పుస్తకానికే పరిమితం కాకూడదు. జీవితాంతం విద్యార్థికి ఉపయోగపడే విధంగా ఉండాలి. ఇంగ్లిష్ చదువుకున్న ప్రతి ఒక్కరికి ఇంగ్లిష్ వచ్చు. కానీ, మాట్లాడితే తప్పులు వస్తాయనే భయం ఉంటుంది. దాన్ని పోగొట్టాలి. అందుకు అనుభవపూర్వక విద్య అవసరం.

– హిమబిందు, ఎస్జీటీ ఉపాధ్యాయురాలు, చౌదర్‌పల్లి



విద్యార్థులతో ఉపాధ్యాయుడు రవి

పాఠానికి ప్రాణం పోసి..

జడ్చర్ల మండలంలోని రామస్వామిగుట్టతండా పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయుడు రవి విద్యార్థులకు సులువైన పద్ధతిలో వినోదాత్మకంగా బోధించాలని సంకల్పించారు. అందుకోసం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాదాపు కథల రూపకంగానే ఎక్కువ సిలబస్ ఉంటుంది. దీంతో ఆయన విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా బోధన ప్రారంభించారు. పాఠ్యాంశంలో చిలుక, లేదా పిల్లి పేరుతో కథ ఉంటే విద్యార్థులకు ఆ వేషాలు వేయించి బోధించడం ఎంతగానో ఆకర్షిస్తుంది. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతిని ఆయన తీసుకువచ్చారు. వీటితోపాటు సైన్స్‌లో మానవ శరీర భాగాలను మనిషి ఎత్తులో చిత్రీకరించి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధిస్తూ ఔరా అనిపిస్తున్నారు.

మూస ధోరణిలో కాకుండా..

విద్యార్థులకు మూస ధోరణిలో కాకుండా వినూత్నమైన పద్ధతిలో బోధించడం వల్ల సులువుగా అర్థమవుతుంది. అందుకోసం విద్యార్థులకు పాఠ్యాంశాల్లో ఉన్న క్యారెక్టర్లకు అనుగుణంగా వేషాలు వేయించి బోధిస్తే వారు ఎప్పటికీ పాఠ్యాంశాలను మర్చిపోలేరు. ఈ విధానం చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది.

– జి.రవి, ఎస్జీటీ ఉపాధ్యాయుడు, ఎంపీపీఎస్ రామస్వామిగుట్టతండా, జడ్చర్ల మండలం

బోధనలో వినూత్నం.. వరించిన పురస్కారం

- వివరాలు 8లో..

ఇంట్లోనే సైన్స్ ల్యాబ్

సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీధర్ అందరి ప్రశంసలు పొందుతున్నారు. గతంలో ఆయన గైడ్ టీచర్‌గా వ్యవహరించి విద్యార్థుల ద్వారా చేసిన పలు ప్రయోగాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. చివరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం అందుకున్నారు. పిల్లలమర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో సైతం పిల్లలకు సైన్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అబ్దుల్ కలాం డ్రీం ఫోర్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఒక కమిటీ ఆధ్వర్యంలో తన ఇంటిపైనే పలువురి సహకారంతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఇందులో సైన్స్ పట్ల ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు నేరుగా వెళ్లి ల్యాబ్‌లో ప్రయోగాలు తదితర అంశాలను ఉచితంగా నేర్చుకోవచ్చు.



సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులకు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్

అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో భావి సైంటిస్టులను తయారు చేసేందుకు కృషి చేస్తున్నాం. అందుకోసం పాఠశాల విధులతో పాటు పిల్లలమర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు, ఎస్సెస్సీ వారికి ముందే సిలబస్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ల్యాబ్‌లో ఉచితంగా ప్రయోగాలు చేసుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు వస్తారు. చాలా మందికి ప్రముఖ సైంటిస్టులతో ముఖాముఖి సైతం నిర్వహిస్తున్నాం.

– శ్రీధర్, స్కూల్ అసిస్టెంట్, నవాబ్‌పేట

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి అంగీకారం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రీజియన్‌లో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఆర్ఎం సంతోష్‌కుమార్ అంగీకరించారని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, నాయకులు జె.ఎస్.రెడ్డి, భగవంతు తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ లో కోత విధించిన 30 శాతం ఆదాయపు పన్ను తిరిగి చెల్లించేందుకు ఒప్పుకొన్నారన్నారు. ఎలక్ట్రికల్ డీలక్స్ బస్సుల్లో రిటైర్డ్ ఉద్యోగుల భార్యాభర్తల ప్రయాణ ం, ఆర్టీసీ క్లినిక్‌లో ల్యాబ్ టెక్నీషియన్ నియామకానికి, మందుల సరఫరాకు అంగీకరించారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, అంజన్న, మనోహర్, రియాజొద్దీన్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట: అమ్మాపురం శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో స్వామి హుండీని గురువారం లెక్కించారు. రూ.7,03,116 ఆదాయం వచ్చిందని, ఇది గత నెల అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని భక్తులు స్వామివారికి కానుకలు సమర్పించుకున్నారని ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతయ్య, కమిటీ సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, కమలాకర్, నాగరాజు, అర్చకులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

7న ఆలయం మూసివేత

ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కురుమూర్తిస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేయనున్నారు. తిరిగి సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, శుద్ధి చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. నిర్మల్‌లో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌కు వెళుతున్న జిల్లా క్రీడాకారులను గురువారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎన్పీ.వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్, కోశాధికారి యూ.సురేష్, నారాయణపేట జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి సిద్ధం

నేడు పాలమూరులో గణనాథుడి శోభాయాత్ర

- మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో భారీ ఏర్పాట్లు
- పాలకొండ, చిన్నదర్పల్లి చెరువుల్లో నిమజ్జనం
- బీచుపల్లికి విగ్రహాలు తరలించేందుకు బైపాస్ వద్ద లారీలు సిద్ధం
- మహబూబ్‌నగర్‌లో ట్రాఫిక్ ఆంక్షలు





మహబూబ్‌నగర్ క్రైం: నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. మహబూబ్‌నగర్ నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఐదు రోజులకు కొన్ని విగ్రహాలను నిమజ్జనం చేసినప్పటికీ మెజార్టీ విగ్రహాల శోభాయాత్ర శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఈ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 250 మంది పోలీస్ సిబ్బందిని నిమజ్జన బందోబస్తుకు కేటాయించారు. మసీదులు, ఆలయాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో పాటు పోలీస్‌శాఖ నుంచి వీడియో చిత్రీకరణ, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉండనుంది. ముఖ్యంగా క్లాక్‌టవర్ సమీపంలో పోలీసులు పూర్తిగా పహారా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని వివిధ కాలనీలో ఉన్న గణనాథులు నిమజ్జనం కోసం ర్యాలీగా క్లాక్‌టవర్ వరకు చేరుకొని అక్కడి నుంచి హన్వాడ, బీచుపల్లి, రంగపూర్ తదితర ప్రాంతాల వైపు వెళ్తాయి. జిల్లా అధికారులు ఐదున్నర అడుగుల ఉన్న వినాయకులను తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

3 రోజుల్లో 1,589 విగ్రహాల నిమజ్జనం

పాలమూరు: జిల్లా పోలీస్ శాఖ లెక్కల ప్రకారం గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న 793 గణనాథులను నిమజ్జనం కోసం తరలిస్తున్నారు. ప్రధానంగా దేవరకద్ర, భూత్పూర్, నవాబ్‌పేట, జడ్చర్ల మండల పరిధిలో గణనాథులను నిమజ్జనం చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న 339 గణనాథులకు శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేయనున్నారు. శనివారం 6న జిల్లాలో మరో 457 గణనాథులను నిమజ్జనం చేయనున్నారు. మూడు రోజుల్లో 1,589 విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

బైపాస్ దగ్గర ఏర్పాట్లు

జిల్లాకేంద్రంలో గతంలో క్లాక్‌టవర్ వరకు శోభాయాత్ర పూర్తయిన తర్వాత మున్సిపల్ మైదానం నుంచి గణనాథులను తరలించేవారు. కానీ ఈసారి మున్సిపాలిటీలో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పాలకొండ దగ్గర ఉన్న బైపాస్ రోడ్డు దగ్గర గణనాథులను అప్పగించాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. ఎస్పీ కార్యాలయంతో పాటు స్థానిక మున్సిపల్ మైదానంలో ఐదు శాఖల అధికారులను కలిపి ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీంట్లో పోలీస్, రెవెన్యూ, ఆరోగ్యశాఖ, విద్యుత్, అగ్నిమాపక శాఖలకు సంబంధించిన ముఖ్య అధికారులు కంట్రోల్ రూంలో విధులు నిర్వహించనున్నారు. క్లాక్‌టవర్, ఇతర శోభాయాత్ర మార్గంలో ఎలాంటి ఘటనలు జరిగిన వెంటనే కంట్రోల్ రూంకు తెలియజేస్తారు. అలాగే జిల్లాకేంద్రంలో 45 సీసీ కెమెరాల ద్వారా శోభాయాత్రను ఎస్పీ కార్యాలయంలో ఉండే కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేయనున్నారు.

నిమజ్జనం వేళ..నిర్లక్ష్యం వద్దు

గణేశ్ నిమజ్జనంలో మేళతాళాలు, డీజే పాటలు, తీన్‌మార్ నృత్యాలు, భారీ ఊరేగింపులతో చిన్నారులు, యువకులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొంటారు. వేలాది మంది పాల్గొనే ఈ ఊరేగింపులో చిన్న అపశ్రుతి చోటు చేసుకున్నా తీవ్రనష్టం జరిగే ప్రమాదం ఉంది. కాగా ఏటా వినాయక ఉత్సవాల్లో చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

- ఉత్సాహంగా ఊరేగింపులతో గణనాథులను నిమజ్జనానికి రంగాపూర్, బీచుపల్లి, హన్వాడ చెరువు, పాల కొండ చెరువు, మయూరీ నర్సరీ దగ్గర, కోయిల్‌సాగర్, జూరాల వంటి ప్రాంతాలకు తరలిస్తారు. ఈ విషయంలో ఈత రానివారు ప్రధానంగా చిన్నారులను చెరువుల వద్దకు తీసుకెళ్ల వద్దని పోలీసులు సూచిస్తున్నారు. తక్కువ లోతు వరకు మాత్రమే వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయాలి.
- ఈత రానివాళ్లు నీళ్లలోకి దిగకూడదు.
- ఊరేగింపుగా వెళ్తున్న సమయంలో మద్యం తాగరాదు.
- ఊరేగింపుగా వచ్చే గణపయ్యలను రోడ్డు పక్కనే ఉండే పెద్ద పెద్ద భవనాలపై చివరి వరకు వచ్చి నిలబడి చూడొద్దు.
- జనరేటర్ నిర్వహణలో తొందరపాటు తగదు
- విద్యుత్ తీగలు తాకకుండా జాగ్రత్తపడాలి. బాణసంచా కాల్చడానికి అనుకూలంగా ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోవాలి.

నిఘాలో శోభాయాత్ర..

గణనాథుల మండప నిర్వాహకులు పగటి వేళలో శోభాయాత్ర నిర్వహిస్తే ప్రజలు చూడడానికి అవకాశం ఉంటుంది. డీజేలకు అనుమతి లేదు. ఎవరూ కూడా ఏర్పాటు చేయరాదు. పాలమూరులో గణేష్ నిమజ్జనానికి 250 మంది పోలీస్ సిబ్బందితో పాటు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా బందోబస్తు పర్యవేక్షించబోతున్నాం. మఫ్టీ బృందాలు, స్పెషల్ టీంలు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని రంగంలోకి దించుతాం. సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలి. ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగించొద్దు. ఈసారి గణనాథులను తరలించడానికి పాలకొండ బైపాస్ రోడ్డును వేదిక ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి మండపం నిర్వాహకులు గణనాథులను అక్కడి వరకు తీసుకొచ్చి మున్సిపల్ అధికారులకు అప్పగించి వెళ్లాలి. నిమజ్జనం చేసే ప్రతి చెరువు దగ్గర హెచ్చరిక బోర్డులతో పాటు పోలీస్ సిబ్బందిని నియమించాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ

కావాల్సిన లారీలు ఏర్పాటు..

మహబూబ్‌నగర్ నుంచి బీచుపల్లి, రంగాపూర్‌కు నిమజ్జనం కోసం గణనాథులను తరలించడానికి రవాణా శాఖ, లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 నుంచి 20 వరకు లారీలు ఏర్పాటు చేస్తాం. ఇంకా అవసరమైతే మరికొన్ని కూడా అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే పాలకొండ బైపాస్ దగ్గర లారీలు ఏర్పాటు చేశాం. ఐదు అడుగుల లోపు ఉన్న ప్రతి విగ్రహాన్ని లారీల్లో తరలిస్తాం. మరీ ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను మండప నిర్వాహకులే స్వయంగా తీసుకెళ్లాలి. మున్సిపాలిటీ సిబ్బంది సహాయంతో విగ్రహాలను లారీల్లో ఎక్కిస్తాం, ఒక్కో లారీలో 20 నుంచి 30 విగ్రహాలు తరలిస్తాం.

– కిషన్, డీటీసీ

గణనాథుల రూట్ మ్యాప్

విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలు నిర్దిష్ట రూట్ల ద్వారా మాత్రమే నిమజ్జన స్థలానికి తరలించాలి.

- హౌసింగ్ బోర్డు, ఏనుగొండ, శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీ, మెట్టుగడ్డ, టీచర్స్ కాలనీ, రాజేంద్రనగర్, న్యూటౌన్, బీకే రెడ్డి కాలనీ వైపు నుంచి వచ్చే గణనాథులను అంబేద్కర్ కూడలి నుంచి అశోక్ టాకీస్ దగ్గర మళ్లీ క్లాక్ టవర్ వైపు వెళ్లాలి. అక్కడ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హారతి ఇచ్చిన తర్వాత క్లాక్‌టవర్ దగ్గర యూటర్న్ చేసుకుని పెద్ద గణనాథులు బీచుపల్లికి, చిన్న గణనాథులు నేరుగా మార్కెట్ రోడ్ మీదుగా టీడీగుట్ట నుంచి చిన్నదర్పల్లి చెరువుకు తరలివెళ్లాలి.
- పాత పాలమూరు, వన్‌టౌన్, భగీరథ కాలనీ, బండ్లగేరి, వీరన్నపేట ప్రాంతాల నుంచి వచ్చే గణనాథుల శోభయాత్ర పాన్‌చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్‌కు చేరుకోవాలి. అక్కడ యూటర్న్ చేసుకుని బీచుపల్లికి, చిన్నదర్పల్లి చెరువుకు వెళ్లాలి.
- మోతీనగర్, బోయపల్లి గేట్, సంజయ్‌నగర్, సుభాష్ నగర్, కొత్త చెరువు రోడ్, కొత్త గంజ్ నుంచి వచ్చే గణనాథులు పాత బస్టాండ్ మీదుగా క్లాక్ టవర్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి నిమజ్జనానికి తరలివెళ్తాయి.



చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న నిమజ్జనోత్సవం ఏర్పాట్లపై కలెక్టర్ విజయేందిర గురువారం అధికారులతో సమీక్షించారు. అనంతరం అప్పన్నపల్లిలోని గంగోసుకుంట, శ్రీనివాసకాలనీలోని పాలకొండచెరువు, చిన్నదర్‌పల్లిలోని కుంట వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిమజ్జనోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



చెరువు దగ్గర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

నిమజ్జనానికి ప్రత్యేక రూట్ మ్యాప్

- నగరంలో ట్రాఫిక్ డైవర్షన్



జిల్లాకేంద్రంలో శోభాయాత్ర సందర్భంగా సందర్భంగా పోలీస్ శాఖ ప్రత్యేక ఆంక్షలు ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్య రాకుండా ప్రత్యేక డైవర్షన్స్ ఏర్పాటు చేశారు. ప్రధానంగా తాండూర్, కోస్గి వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను ఫైర్ స్టేషన్ దగ్గర దారి మళ్లించి కొత్త బ్రిడ్జి మీదుగా తెలంగాణ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు, అదేవిధంగా హైదరాబాద్, జడ్చర్ల వైపు నుంచి తాండూర్ వైపు వెళ్లే వాహనాలను అంబేద్కర్ చౌరస్తా దగ్గర నుంచి తెలంగాణ కూడలి, కోర్టు ముందు నుంచి కొత్త బ్రిడ్జి మీదుగా టీడీగుట్ట మీదుగా దారి మళ్లింపు చేస్తున్నారు. ఇక క్లాక్‌టవర్ వైపు వెళ్లే వాహనాలను పాత బస్టాండ్ దగ్గర అడ్డుకొని నవోదయ ఆస్పత్రి వైపు, రాయచూర్ నుంచి తాండూర్ వైపు వచ్చే వాహనాలను వన్‌టౌన్, అశోక్ టాకీస్ చౌరస్తా, తెలంగాణ కూడలి మీదుగా కొత్త బ్రిడ్జి నుంచి టీడీ గుట్ట వైపు మళ్లిస్తారు.

'కాళేశ్వరం' అవినీతిని నిగ్గు తేల్చేందుకే సీబీఐ విచారణ



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్యేలు మధుసూదనరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన ప్రజాధనం దుర్వినియోగం, అవినీతిని నిగ్గుతేల్చేందుకే సీబీఐ విచారణ కోరినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందమని, చేతగాకనే కాళేశ్వరంను సీబీఐ విచారణకు ఇచ్చారని ఎంపీ డీకే అరుణ అనడం అర్థరహితమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్‌తో సమగ్ర విచారణ, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, విజిలెన్స్ కమిషన్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టిన తర్వాత అందరి సమ్మతితో సీబీఐకు అప్పగించినట్లు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీల బంధం ఎలాంటిదో పార్లమెంట్ ఎన్నికల్లో చూశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరుశాతం కాళేశ్వరంలో జరిగిన అవినీతిని కూకటివేళ్లతో బయటకు తీస్తుందన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం దోచుకున్న సొమ్ము పంపకాల్లో తేడాలు రావడంతోనే గొడవలు జరుగుతున్నాయని అన్నారు. సీఎం పేరును వారి కుటుంబ గొడవల్లోకి లాగుతున్నారని, సీఎంకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ డిమాండ్ చేసినట్టే కాళేశ్వరంపై విచారణ సీబీఐకి అప్పగించామని, విచారణ పూర్తి చేసి బీజేపీ చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపైన విచారణ చేసి దోషులను సత్వరమే శిక్షించేందుకే సీబీఐకి కేసును అప్పగించారని అన్నారు. తప్పు చేసిన దోషులను శిక్షించాలంటే జరిగిన అవినీతిపైన సమగ్ర విచారణ వేగవంతం చేయాలని సీఎం ఆలోచన చేశారని అన్నారు. ఘోష్ కమిటీ ఇచ్చిన నివేదికలో అంతర్రాష్ట నదీ జలాలకు సంబంధించి విషయం ఉందని, తుమ్మిడిగడ్డ ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చడం, సీడబ్ల్యూసీ ఇచ్చిన లేఖల ఆధారం, నేషనల్ డ్యాంసేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్టులు, అన్ని రిపోర్టుల ఆధారంగా ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ రిపోర్టు ఇచ్చిందన్నారు. సీబీఐ పరిధిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉంటాయని, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో ఏజెన్సీలు ఫండింగ్ చేశాయని అన్నారు. సత్వర విచారణకు సీబీఐ కరెక్ట్ అని, టెక్నికల్ అంశాల్లో కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని, సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన రోడ్ల మరమ్మతు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వర్షాలకు పాడైన రోడ్లు, ప్రభుత్వ భవనాలను గుర్తించి మరమ్మతులు చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతేడాది విపత్తు నిర్వహణ కింద వరదలు, వర్షాలు దెబ్బతిన్న భవనాలు, రోడ్లకు మరమ్మతుల మంజూరు, వ్యయం వివరాలు, బ్యాలెన్స్ నిధులపై సమీక్షించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రస్తుతం 2025 వర్షాలకు గుంతలు పడిన రోడ్లను వెంటనే వాటిని గుర్తించి ప్యాచ్ వర్క్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, గ్రామ పంచాయతీ భవనాలు, వార్డ్ ఆఫీసర్ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లకు మరమ్మతులు అవసరం ఉంటే అంచనాలు పంపించాలన్నారు. ఎస్డీఆర్ఎఫ్ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం మరమ్మతులు చేయాల్సిందిగా సూచించారు.

భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. తిరస్కరించిన, పరిష్కరించిన, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను మండలాల వారీగా సంబంధిత తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఒక్క దరఖాస్తును కూడా పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మూసాపేట మండలంలో నిర్మాణం పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని గృహ నిర్మాణ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నరసింహారెడ్డి, ఆర్డీఓ నవీన్, డీఆర్డీఓ నర్సింహులు, హౌసింగ్ పీడీ భాస్కర్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్ఓ కృష్ణ, మహిళ శిశు సంక్షేమ అధికారిని జరీనా బేగం, జిల్లా వెటర్నరీ అధికారి మధుసూదన్ గౌడ్, డీపీఓ పార్థసారథి, డీఏఓ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): 'ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖకు సమాచారం ఇవ్వండి' అనే స్టిక్కలు అతికించారు. కలెక్టరేట్‌లో ఉన్న ప్రతి శాఖ కార్యాలయం ప్రధాన డోర్‌కు ఈ స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మిమ్మల్ని ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తున్నారా..? అయితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయండి అని ఉన్న స్టిక్కర్లను అతికించారు. ఏదిఏమైనా ఈ స్టిక్కర్లు ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంత భయాన్ని రేపుతున్నాయి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి


కిష్టమ్మ(ఫైల్)

నవాబుపేట: పంట పొలానికి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె ప్రమాదవశాత్తు తగిలి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన కంచె కిష్టమ్మ(40) రెండు రోజులుగా ఇంటి నుంచి అదృశ్యమైంది. గురువారం ఉదయం గ్రామ సమీపంలో కుమ్మరి రాములు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు వేసిన విద్యుత్ కంచె వల్ల షాక్‌కు గురై అక్కకక్కడే మృతి చెందింది. చుట్టు పక్కల వారు గమనించి ఆమె కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. ఆమె కుమారుడు నరేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




మృతుడు రోహిత్

జడ్చర్ల: పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కంటెయిర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపునకు వెళ్తున్న కంటెయినర్‌ను బ్రిడ్జిపై వెనుక నుంచి అతి వేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న రోహిత్ (30) అక్కడికక్కడే మృత్యువాత పడగా.. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారందరూ హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జగదీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం


మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కుటుంబసభ్యులు

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆయనది ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం: మంత్రి వాకిటి శ్రీహరి
- పాలమూరులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు సుదీర్ఘకాలంగా పని చేశారని, పార్టీ యంత్రాంగాన్ని నడపాలంటే ఆయన్ను చూసి నేర్చుకోవాలని, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో గురువారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ పార్టీ పరమైన అంశాల్లో, ఇతర సమస్యల్లో ఎవరి మనసు నొప్పించక ప్రజాస్వామికబద్ధంగా వ్యవహరించేవారని అన్నారు. ఆనాడు పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జిల్లా నుంచి ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు సరైన వ్యక్తిగా ఆయన జీవన ప్రయాణం కొనసాగిందన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయననే చూసే నేర్చుకోవడం జరిగిందన్నారు. ఎంపీ డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడని, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డితో తనకు ఎంతో ఆత్మీయత అనుబంధం ఉందన్నారు. మొదట్లో నాకు రాజకీయాలు వద్దని చెప్పారని, తర్వాత నాకున్న ఆసక్తితో రాజకీయాల్లో ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతురావు మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేదలకు సహాయం చేయడంలో ముందుండేవారని అన్నారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, యశస్విని‌రెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, కోదండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, యాదవరెడ్డి తదితరులు జగదీశ్వర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, బెక్కరి మధుసూదన్ రెడ్డి, డాక్టర్ నందిని, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ. వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, భగవంతు రావు, సీజే బెనహర్, ప్రశాంత్‌రెడ్డి, మిథున్ రెడ్డి, జహీర్ అఖ్తర్, సాయిబాబా పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు


క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌ల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు పూర్తి
- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ప్రేక్షకులతో కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి 225 క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు గురువారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచిన వారు శుక్రవారం నుంచి జరిగే మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం...

రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు పరిశీలించారు. నాలుగు సింథటిక్ కోర్టుల్లో సింగిల్, డబుల్స్ పోటీలు జరుగుతాయని, ఈ నెల 7న చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకుడు సుధాకర్, రెఫరీ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, విజయ్‌రెడ్డి, ఎంపీ.ప్రవీణ్, సభ్యులు శశాంక్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి అటవీ భూమి


సమస్య పరిష్కారంపై వివరాలు ప్రకటిస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిచెందిన పర్వాతాపూర్ మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ద్వారా ప్రత్యేక ప్రతిపాదన చేసినట్లు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మైసమ్మ ఆలయానికి అదనంగా 4.0889 హెక్టార్ల (దాదాపు పది ఎకరాలు)అటవీ భూమి కోసం ప్రత్యేక వినతిని జడ్చర్ల ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ అటవీ భూమిలో సంబంధిత అధికారులతో సర్వే చేయించి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, కేంద్ర కార్యాలయం తుది అనుమతి రావాల్సి ఉందని.. దీనికి త్వరలోనే అనుమతులు తీసుకొచ్చేలా చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

ఆలయ సిబ్బందికి పెరిగిన వేతనాలు

కొన్నేళ్లుగా ఆలయంలో వివిధ రకాల పనులు చేస్తున్న వారికి కనీస వేతనాలు పనికి తగ్గట్లుగా అందేవి కావు. దీంతో వారు చాలా ఏళ్లుగా కనీస వేతనం కోసం జడ్చర్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడంతో తాజాగా 6 కూలీలకు కనీస వేతనం అందించే జీఓ బుధవారం వచ్చిందని మైసమ్మ ఆలయ చైర్మన్ తెలిపారు. దీంతో గతంలో నెలకు రూ.7500 అందించే వేతనాన్ని రూ.12వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే వంశపారంపర్యంగా ఆలయంలో పనులు చేసే మరో వ్యక్తికి సంబంధించి పర్మినెంట్ వేతనం మంజూరు చేస్తూ ప్రభుత్వం గజిట్ ఇచ్చిందని తెలిపారు. దీంతో ఆలయంలో ఉన్న పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చైర్మన్‌తోపాటు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలి


యూరియా పంపిణీ గురించి చైర్మన్ కోదండరెడ్డికి వివరిస్తున్న ఏఓ శ్రీనివాసులు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని బోయపల్లిరోడ్‌లో గల హాకా రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, రైతులు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకరోజు ముందుగానే టోకన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేస్తున్నామని అధికారులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అందరికీ టోకెన్లు వచ్చేలా చూడాలని, మహిళలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారికి చైర్మన్ ఫోన్ చేసి యూరియా పంపిణీ, భూ భారతి చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. రైతులకు ఒకే కేంద్రానికి కేంద్రానికి రాకుండా ఎక్కడి వారికి అక్కడే పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్, డీఏఓలకు సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్న విషయాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ


బైక్‌పై పారిపోతున్న దుండగులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఫ్రీజన్ రోడ్డులో గురువారం గోదా నాగలక్ష్మి అనే మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడు (బంగారుగొలుసు) చోరీ చేశారు. స్థానికంగా నివాసముంటున్న నాగలక్ష్మి రేషన్ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఫాలో అవుతూ వచ్చాడు. నిర్మానుష ప్రాంతంలో మెడలోని గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. అనంతరం ఎన్ఎస్125 బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో దుండగుడితో కలసి పరారైనట్లు పేర్కొన్నారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని సీసీ కెమెరాల రికార్డులు పరిశీలించారు. చోరీ అయిన గొలుసు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జావిద్ (35), బుచ్చయ్య ఇద్దరు బుధవారం చేపల వేటకు వెళ్లారు. కాగా జావిద్ చేపల పట్టుకునే క్రమంలో చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బుచ్చయ్య గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ విక్రమ్ గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి మరో సారి గాలింపుచర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా జావిద్‌కు భార్య అన్వీర్‌తో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్రంలో అధిక వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆహార ధాన్యాల పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. భారీ వర్షాల వల్ల దాదాపు 5,435 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. చిన్ననీటి వనరులకు దాదాపు రూ.629 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 2.5 లక్షల ఎకరాలు వరద ముంపునకు గురైనట్లు తెలిపా రు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం పన్ను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రధానికి తీర్మానం కాపీలు పంపాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.రాములు, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్, హన్మంతు పాల్గొన్నారు.

దిగువ జూరాలలో సోలార్ కేంద్రం

జెన్‌కో సీఎండీ డా. హరీశ్

ఆత్మకూర్: రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద అవకాశం ఉన్నచోట సోలార్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని టీఎస్ జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. హరీశ్ తెలిపారు. గురువారం జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలను సందర్శించారు. దిగువ జూరాల వద్ద 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని.. 20 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే కొత్తగూడెంలో కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది దిగువ జూరాలలో రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టి లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమన్నారు. ఎగువన కూడా లక్ష్యానికి చేరువలో ఉన్నారని చెప్పారు. బదిలీలు చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగులు సీఎండీని అభ్యర్థించగా త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డైరెక్టర్ బాలరాజు, ఎస్ఈలు శ్రీధర్, సురేష్, సిబ్బంది ఉన్నారు.

బోధనలో వినూత్నం.. వరించిన పురస్కారం

- పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి అవార్డు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొన్ని సంవత్సరాలుగా అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూ.. పీజీ కళాశాల ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డును ప్రకటించింది. ఆయన యూజీ, పీజీ స్థాయిలో పనిచేయడంతోపాటు ఆయన చేసిన 35 పరిశోధనలకు జాతీయ, అంతర్జాతయ స్థాయిలో రీసెర్చ్ పత్రాలను సమర్పించారు. 11పుస్తకాలను జాతీయ, అంతర్జాతీయ పబ్లిషర్స్ పబ్లిష్ చేశాయి. ఆయన చేసిన రెండు రీసెర్చ్‌లకు రూ.56లక్షలతో ప్రాజెక్టులు వచ్చాయి. దీంతోపాటు పీయూ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, వీసీ ఓఎస్డీ, ఐక్యూఏసీ డైరెక్టర్, బోర్డు ఆఫ్ స్టడీస్ డైరెక్టర్‌తోపాటు ఐదుగురు వీసీలు, ఏడుగురు రిజిస్ట్రార్‌ల వద్ద అడ్మినిస్ట్రేషన్ పరంగా విధులు నిర్వహించడంతో ఆయనకు ప్రభుత్వం అవార్డును ప్రకటించింది.

అవార్డుతో మరింత బాధ్యత



సుదీర్ఘమైన అధ్యాపక వృత్తిలో అనేక సేవలు అందించా. అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ పరంగా పలు స్థాయిల్లో బాధ్యతలు చేపట్టాను. ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డును ప్రకటించడం చాలా సంతోషకరం. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచింది. అవార్డు వచ్చినందుకు గతంలో పనిచేసిన వీసీలు, ప్రస్తుత వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– మధుసూదన్‌రెడ్డి, పీయూ ప్రిన్సిపాల్

నర్సింహారావుకు ఉత్తమ అవార్డు


నర్సింహారావును సన్మానించి అభినందిస్తున్న బీఆర్ఆర్ కళాశాల సిబ్బంది

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అధ్యాపకులలో పట్టణంలోని డిగ్రీ కళాశాల హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.నర్సింహారావు కల్యాణి ఎంపికయ్యారు. నారాయణపేటకు చెందిన డా.నర్సింహారావు ఇంటర్ వరకు అక్కడే చదవి డిగ్రీ జడ్చర్ల బీఆర్ఆర్ కళాశాలలో చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగంలో ఎంఏ, ఎంఫిల్ పట్టాలు పొంది హిందీ సాహితీవేత్త డా.ప్రభాకర్ నవలల్లో సమకాలిన వాస్తవికత అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందాడు. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇప్పటి వరకు 30హిందీ కథలను రాయగా.. హిందీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పీయూ, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, హిందీ బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. అలాగే హిందీ, ఉర్దూ బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. జిజ్ఞాసలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి, హిందీ వీడియో పాఠాలు బోధిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనందుకు ప్రిన్సిపాల్ సుకన్య నేతృత్వంలోని అధ్యాపకబృందం గురువారం శాలువాతో సత్కరించి అభినందించారు.

ఆనందగా ఉంది

చదువుకున్న కళాశాలలో పనిచేస్తున్న సమయంలోనే రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డు రావడం ఆనందంగా ఉంది. జూనియర్ లెక్చరర్‌గా దివంగత వైఎస్సార్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నా. తిరిగి ఇన్నాళ్లకు డిగ్రీ కళాశాల స్థాయిలో అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యత పెరిగింది. హిందీ విభాగంలో మరింత సేవలు అందించేందుకు అవార్డు స్ఫూర్తిగా నిలవనుంది.

– డా.నర్సింహారావు కల్యాణి, అసోసియేట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాల, జడ్చర్ల

ఉర్దూ మీడియంలో వినూత్న బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో సీసీఈ పద్ధతుల్లో సిలబస్ అమలు, వినూత్న పద్ధతిలో విద్యార్థులకు బోధన చేయడంతో జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ మీడియం ఉపాధ్యాయుడు అబ్దుల్‌ఖాలీక్‌ను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఈ మేరకు ఆయన ఉర్దూ మీడియంలో విద్యార్థులకు బోధన తదితర అంశాలపై చేసిన సేవలకు ప్రభుత్వం అవార్డును ప్రకటించింది. పాఠ్యపుస్తకాల మాడ్యూల్ ప్రిపరేషన్, పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలతో టీశాట్ విద్యార్థులకు లైవ్ తరగతులు బోధించడం, ఉర్దూ మీడియంలో సృజనాత్మకత బోధన, న్యాస్ పరీక్ష పేపర్ల ప్రిపరేషన్‌లో పాల్గొన్నారు. వీటితోపాటు టీచర్ ట్రైనింగ్ మాడ్యూల్ ప్రిపరేషన్ రీసోర్సుపర్సన్‌గా, డిజిటల్ విద్య తరగతులను బోధించినందుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది.

పేదవిద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నాం. ఉర్దూ మీడియంలో విద్యార్థులకు ఆన్‌లైన్, డిజిటల్ తరగతులు బోధించడం ఎస్సీఆర్టీతో పాటు పలు స్థాయిలో మ్యాడ్యుల్స్ ప్రిపరేషన్‌లో పాల్గొన్నా. నా సేవలకు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డు నాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను.

– అబ్దుల్‌ఖాలీక్, స్కూల్ అసిస్టెంట్, ఉర్దూ, పోలీస్‌లైన్ స్కూల్

విద్యారంగంలో సేవకు గుర్తింపు..

జిల్లా కేంద్రంలోని ఎంబీసీ (ఎయిడెడ్) పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి కొన్నేళ్లుగా విద్యారంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంచడం, వనరులు అరకొర ఉన్నప్పటికీ విద్యార్థులు పాఠశాల యాజమాన్యం సహాయ, సహకారాలతో మెరుగైన విద్య అందించడంలో తనదైన పాత్ర పోషించారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు, వనరులు సమకూర్చడంలో పూర్వ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఆర్వో ప్లాంట్, బోర్, డ్యూయెల్ డెస్కుల్, బోర్డులు సమకూర్చారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పెంచాం.

సమాజ సేవ చేస్తాం



ప్రభుత్వం ఉత్తమ అవార్డు ఇవ్వడంతో బాధ్యత పెరిగింది. దీని ద్వారా మరింత సమాజ సేవ, విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషిచేస్తా. పేద విద్యార్థులకు అన్నిసౌకర్యాలతో కూడిన విద్య అందించే దిశగా అడుగులు వేస్తాం. ఇందుకు సహకరించిన డీఈఓ ప్రవీణ్‌కుమార్, పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– జగదీశ్వర్‌రెడ్డి, ఎంబీసీ పాఠశాల హెచ్‌ఎం

డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలి

- కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్


చిన్నదర్పల్లి బీట్ పరిధిలో అటవీ భూమిని పరిశీలిస్తున్న డీజీ చంద్రశేఖర్


మయూరీ పార్క్‌ను పరిశీలిస్తున్న అటవీ డీజీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణలో ఫారెస్ట్ డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న అటవీ భూమి, చెట్లను ఆయన పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నష్టానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని డీఎఫ్ఓ సత్యనారాయణకు సూచించారు. విస్తరణలో పోతున్న అటవీ భూమికి బదులుగా మరోచోట ఇవ్వడం, చెట్లకు బదులుగా మరోచోట నాటడం వంటి పనుల్లో ఎలాంటి జాప్యం జరగరాదని సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ సమీపంలోని దొడ్డలోనిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధి ప్లాంటేషన్, మయూరీ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో ఏర్పాట్లు, మొక్కలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి అబ్దుల్‌హాయ్, జాతీయ రహదారి ఈఈ తదితరులు పాల్గొన్నారు.